క్లుప్తంగా

క్షయ వ్యాధిపై అపోహలు వీడాలి



మాట్లాడుతున్న అడ్మిన్ శ్రీకాంత్

కర్నూలు(హాస్పిటల్): క్షయ వ్యాధిపై ఉన్న మానసిక రుగ్మత, అపోహలను తొలగించుకోవాలని టీబీ ముక్త్ భారత్ అడ్మిన్ శ్రీకాంత్ సూచించారు. బుధవారం స్థానిక ముజఫర్ నగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని 84వ సచివాలయంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, బరువు తగ్గిపోవడం లక్షణాలు ఉంటే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి టీబీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. జన భగీదారిలో భాగంగా ప్రజలకు టీబీ గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వీఆర్‌ఓ చంద్రశేఖర్, టీబీ ప్రయోగశాల సూపర్‌వైజర్ ఇమ్రాన్‌బాషా, ఆరోగ్య కార్యకర్త మహాలక్ష్మి, సంధ్యారాణి, రమణమ్మ పాల్గొన్నారు.

యోగా ఇన్‌స్ట్రక్టర్‌కు డాక్టరేట్



ఉమాదేవి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు జిల్లా ప్రభుత్వ ఆయుష్ ఆరోగ్య మందిర్‌లో యోగా ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తున్న జి.ఉమాదేవికి ఎడ్యుకేషన్ సబ్జెక్టుపై రాయలసీమ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ మంజూరైంది. 'ఎ క్రిటికల్ అప్రైజల్ ఆఫ్ ఫంక్షనింగ్ ఆఫ్ కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాస్ (కేజీబీవీస్) ఇన్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై ఆమె పరిశోధన చేశారు. ఈ పరిశోధనకు ప్రొఫెసర్ కేఎస్.ప్రభాకరన్ మార్గదర్శకుడుగా సహకరించారు. శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆమె పరిశోధన ఉందని గుర్తించి రాయలసీమ విశ్వవిద్యాలయం ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేసింది.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు



తీవ్రంగా గాయపడిన మణిరత్నం

ఆలూరు రూరల్: బైక్ అదుపుతప్పి వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పట్టణ సమీపంలోని కర్నూలు-ఆదోని వై జంక్షన్ వద్ద బుధవారం సాయంత్రం ప్రమాదం చోటు చేసుకుంది. వివరాలు.. బళ్లారి జిల్లా కారెకల్లు గ్రామానికి చెందిన మణిరత్నం ఆదోని నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా ఆలూరు సమీపంలోని వై జంక్షన్ వద్ద ట్రాఫిక్ నియంత్రణ కోసం రహదారిపై ఉంచిన డ్రమ్ములను ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రయాణికులు గమనించి 108 వాహనంలో ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి

తుగ్గలి: పొలంలో గుంటక పాస్తుండగా విద్యుదాఘాతానికి గురై కాడెద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని కొత్తపల్లి గుడిసెలలో చోటుచేసుకుంది. రైతు మోట రాము బుధవారం పంట పొలంలో గుంటక పాస్తుండగా విద్యుత్ స్తంభానికి సపోర్టుగా వేసిన వైరుకు విద్యుత్తు ప్రసరించడంతో దాన్ని తాకిన ఎద్దు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. దాదాపు రూ.లక్ష విలువ చేసే ఎద్దు విలవిల్లాడి మృతి చెందడంతో రైతు విలపించాడు.

కోలుకోలేక యువకుడి మృతి



రవికుమార్ (ఫైల్)

దేవనకొండ: మండలంలోని కరివేముల గ్రామానికి చెందిన రవికుమార్ (21) చికిత్స నుంచి కోలుకోలేక మృతి చెందాడు. వివరాలు.. రవికుమార్ సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో పాము కరిచింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే నాటు వైద్యం చేసి తర్వాత కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స నుంచి కోలుకోలేక మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడికి ఏడాది క్రితమే వివాహమైంది. మృతుడి తండ్రి సుంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కస్తూర్బా ప్రిన్సిపాల్‌పై విచారణ

ఆదోని సెంట్రల్: పట్టణంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్రిన్సిపాల్ శాంతి మాట తీరు సరిగా లేదంటూ ఫిర్యాదులు రావడంతో ఉప విద్యాధికారి వెంకటరమణా రెడ్డి, మండల విద్యాధికారి శ్రీనివాసులు బుధవారం విచారణ చేపట్టారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు ఆమె నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని కొంతమంది జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో జిల్లా విద్యాధికారి శామ్యూల్ పాల్ విచారణ చేపట్టాలని ఆదేశించారని చెప్పారు. ఈ మేరకు విద్యార్థినుల తల్లిదండ్రులను పిలిపించి విచారించామన్నారు. నివేదికను తయారు చేసి అధికారులకు అందిస్తామన్నారు.

ఏడాదిలోపే కూటమిపై ప్రజా వ్యతిరేకత

- ప్రభుత్వ మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరిద్దాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి



ప్రభుత్వ మోసాలను వివరిస్తూ క్యూఆర్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్వీ మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

కర్నూలు (టౌన్): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే అన్ని వర్గాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీమోహన్ రెడ్డి అన్నారు. ఆయన బుధవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో కర్నూలు నగరంలోని 13 నుంచి 25 వార్డుల పరిధిలోని కార్పొరేటర్లు, నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఏ ఒక్క హామీని నేరవేర్చలేదన్నారు. కేవలం అధికారం కోసమే ప్రజలకు 149 హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడేమో సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నాయని చెప్పడం ప్రజలను మోసం చేయడం కాదా అన్ని ప్రశ్నించారు. రైతులను, మహిళలను, నిరుద్యోగులను ఇలా ప్రతి వర్గాన్ని మోసం చేయడం కూటమి ప్రభుత్వానికే చెల్లిందన్నారు. జగనన్న హయాంలో ఐదేళ్ల పాటు ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఇస్తామని చెప్పిన ఆడబిడ్డ నిధి నెలకు రూ.1500, అన్నదాన సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు, 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నెలకు రూ.4 వేలు పెన్షన్, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు భృతి ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. అధికారం చేపట్టి ఏడాది దాటింది ఇంకా ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. సీఎం చంద్రబాబు మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 8 నెలల్లో కర్నూలు కార్పొరేషన్‌కు ఎన్నికలు వస్తున్నాయని, పార్టీ క్యాడర్ ఇప్పటి నుంచే ప్రజలకు అందుబాటులో ఉండి చంద్రబాబు వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ మాట్లాడుతూ.. చంద్రబాబు ఏడాది పాలనలో మహిళలను అన్ని విధాలుగా మోసం చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో మహిళలు ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం ప్రభుత్వం హామీలు అమలు చేయకపోవడం వల్ల ఆయా కుటుంబాలు ఎంతమేర నష్టపోయాయో తెలుపుతూ క్యూఆర్ పోస్టర్లను ఆవిష్కరించారు. పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపునకు ప్రాధాన్యత

కర్నూలు (టౌన్): నగరంలో పచ్చదనం పెంపునకు ప్రాధాన్యత ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక పెద్ద మార్కెట్, పాతబస్తీ ఏరియా, సీ.క్యాంపు, బిర్లా కాంపౌండ్, వెంకటరమణ కాలనీల్లోని ప్రాంతాల్లో పలు పార్కులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రస్తుత వర్షాకాలంలో నగర పరిధిలో 30 వేల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోజు వారీ ప్రణాళికతో ఈ ఏడాది ఆఖరుకు మొక్కలు నాటడం పూర్తి చేస్తామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో, పార్కు స్థలాల్లో, విస్తృతంగా మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు. ప్రజలు తమ వంతుగా మొక్కల సంరక్షణకు సహకరించాలన్నారు. అంతకుముందు కమిషనర్ పాతబస్టాండ్‌లోని అన్న క్యాంటీన్, సీతారామనగర్‌లో పారిశుద్ధ్య పనులను, అలాగే కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న పార్కును పరిశీలించారు. లైటింగ్, వాటర్ ఫౌంటెన్ల మరమ్మతులు చేపట్టాలని, నైట్ వాచ్‌మన్‌లను ఆదేశించారు.

స్విమ్మింగ్ క్రీడాకారులకు అభినందన



కలెక్టర్ రంజిత్‌బాషాతో స్విమ్మింగ్ క్రీడాకారులు

కర్నూలు కల్చరల్: రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి ఈత, వాటర్ పోలో పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులను కలెక్టర్ పి.రంజిత్ బాషా అభినందించారు. బుధవారం కలెక్టర్‌ను కలిసిన ఈత క్రీడాకారులు వై.దేవశ్రుత్ సాయి, ఎ.భువనాదిత్య, పి.హేమలత, కె.శృతిలకు మెడల్స్, సర్టిఫికెట్లు, ఓవరాల్ రన్నరప్ కప్‌ను కలెక్టర్ అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల ఆరోగ్యంగా ఉండటంతో పాటు అందులో ప్రతిభ కనబరిస్తే విద్య, ఉద్యోగ రంగాల్లో వెయిటేజీ వస్తుందన్నారు. డీఎస్‌డీఓ భూపతి రావు, స్విమ్మింగ్ కోచ్ నటరాజ్, కర్నూలు డిస్ట్రిక్ట్ ఆక్వాటిక్ అసోసియేషన్ కార్యదర్శి రామకృష్ణయాదవ్, కోశాధికారి దస్తగిరి, కార్యనిర్వాహక కార్యదర్శి అజయ్, సంయుక్త కార్యదర్శులు శివరాజ్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

నేటి మహిళలకు స్ఫూర్తి లక్ష్మీసెహగల్



కెప్టెన్ లక్ష్మీ సెహగల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఇందిరాశాంతి, ఐద్వా నాయకురాలు

కర్నూలు సిటీ: స్వాతంత్య్ర సంగ్రామంలో మహిళల పాత్ర ఎనలేనిదని, కెప్టెన్ లక్ష్మీ సెహగల్ వంటి మహిళా నాయకురాలి సేవలను గుర్తు చేసుకోవాలని ఐద్వా సీనియర్ నాయకురాలు పి.నిర్మల అన్నారు. బుధవారం క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కమిటీ సంయుక్తంగా కెప్టెన్ లక్ష్మీ సెహగల్ వర్ధంతిని పురస్కరించుకోని 'స్వాతంత్య్ర సంగ్రామంలో కెప్టెన్ లక్ష్మీ సెహగల్ పాత్ర' అనే అంశంపై ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఇందిరాశాంతి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ముందుగా లక్ష్మీ సెహగల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారితో పాటు డాక్టర్ మాధవి, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎస్.అలివేలు, జనవిజ్ఞాన వేదిక నాయకురాలు కె.సుజాత మాట్లాడారు.

స్వాతంత్య్ర సమరయోధుల జయంతి వేడుకలు

భారత స్వాతంత్ర సమరయోధులు బాల గంగాధర్ తిలక్, చంద్రశేఖర్ అజాద్ జయంతి వేడుకలు పురుషుల డిగ్రీ కాలేజీలో నిర్వహించారు. కాలేజీ వైస్ ప్రిన్సిపాళ్లు జే.హేమంత్, సత్యనారాయణ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె.అరుణ పాల్గొని తిలక్, అజాద్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐద్వా నగర నాయకులు వేణి, అమీనా, క్రమీస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సీ.క్యాంపు రైతుబజారు బంద్

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలులోని సి.క్యాంపు రైతుబజారును గురువారం ఒక్కరోజు బంద్ చేస్తున్నట్లుగా ఎస్టేటు ఆఫీసర్ కళ్యాణి, హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్ తెలిపారు. రైతుబజారులో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నామని, క్లీనింగ్ నిమిత్తం ఒకరోజు సెలవు ప్రకటించినట్లు బుధవారం వారు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు, రైతులు, పొదుపు మహిళలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. శుక్రవారం నుంచి యథావిధిగా రైతుబజారు పనిచేస్తుందని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం బృందం నగరంలోని గవర్నమెంట్ గరల్స్, ఉర్దూ బాయ్స్, మైనార్టీ జూనియర్ కాలేజీల్లో నెలకొన్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించింది. ఈ సందర్భంగా గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ.. గవర్నమెంట్ గరల్స్ హైస్కూలులో మధ్యలో నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఉర్దూ బాయ్స్ హైస్కూలులో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. మైనార్టీ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు ఆటస్థలం చూపాలని కోరారు. నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, నాయకులు పార్వతయ్య, శాలిబాషా పాల్గొన్నారు.

25న వాహనాల వేలం

కర్నూలు(హాస్పిటల్): ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 65 వాహనాలను ఈ నెల 25వ తేదీన కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్‌లో వేలం వేయనున్నట్లు సీఐ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేదీన వాహనాలను వేలం వేయాల్సి ఉందని, అనివార్య కారణాల వల్ల 25న వేలం వేస్తున్నామన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే వేలానికి సంబంధించి అభ్యర్థులు ముందుగా తాలూకా పోలీస్ స్టేషన్‌లో ధరావత్ రూ.5 వేలు చెల్లించి తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. వేలం పాటలో వాహనాలను పొందిన అభ్యర్థులు మొత్తం డబ్బులు చెల్లించి వాహనాలను తీసుకెళ్లాలన్నారు.

ఫ్యాన్ల మాయంపై చర్చ

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ హాస్టళ్లలో ఫ్యాన్లు మాయం కావడంపై చర్చ జరుగుతోంది. రూసా నిధులతో వర్సిటీ హాస్టళ్లు, వివిధ డిపార్ట్‌మెంట్‌లలో కొత్త ఫ్యాన్లను ఏర్పాటు చేస్తున్నారు. అయితే పనిచేస్తున్న ఫ్యాన్లను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడమేంటని విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు చర్చించుకుంటున్నారు. పనిచేయని చోట కొత్తవి ఏర్పాటు చేస్తే ఉపయుక్తంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తొలగించిన ఫ్యాన్లు పదుల సంఖ్యలో కనిపించడం లేదని విద్యార్థులు అంటున్నారు. గత రెండేళ్లలో ఇలానే వందల సంఖ్యలో ఫ్యాన్లు మాయమైనట్లు చెబుతున్నారు. ఎవరైనా దొంగలించారా, స్క్రాప్ కింద అమ్ముకున్నారో స్పష్టత లేకపోవడం గమనార్హం. ఈ విషయమైన వర్సిటీ హాస్టల్స్ చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ ఎన్.నరసింహులును వివరణ అడగ్గా ఫ్యాన్లు మాయమైనట్లు తన దృష్టికి రాలేదన్నారు. ఇలాంటివన్నీ ఇంజినీరింగ్ విభాగం ఉద్యోగులు చూసుకుంటారని వారిని సంప్రదిస్తే స్పష్టత వస్తుందన్నారు. ఫ్యాన్లు పనిచేయడం లేదు, కావాలని లెటర్ పెడితే రిజిస్ట్రార్‌కు ఫార్వర్డ్ చేస్తుంటానన్నారు.

చంద్రబాబు మోసాలు బట్టబయలు

- ఆడబిడ్డ నిధిపై చేతులెత్తేసిన ప్రభుత్వం
- ఎన్నికల్లో మహిళల సత్తా చూపిస్తాం
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లా నాగవేణి రెడ్డి



మాట్లాడుతున్న కల్లా నాగవేణి రెడ్డి

కర్నూలు (టౌన్): సూపర్ సిక్స్ హామీల అమల్లో చంద్రబాబు మోసాలు బట్టబయలయ్యాయని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లా నాగవేణి రెడ్డి వెల్లడించారు. ఆమె బుధవారం ఎస్వీ కాంప్లెక్స్‌లో మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఎదుర్కోలేక, బీజేపీ, జనసేనతో జతకట్టి, ప్రజలకు అలవిగాని హామీలు ఇచ్చి మభ్యపెట్టి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చారన్నారు. ఆడబిడ్డ నిధి కింద మహిళలకు ప్రతి నెలా రూ.1500 ఇస్తామని ప్రకటించడంతో ఎన్నికల సమయంలో మహిళలు ఎంతో సంతోషపడ్డారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటిన తరువాత టీడీపీ మంత్రి అచ్చెంనాయుడు ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే ఆంధ్రప్రదేశ్‌ను అమ్మాలని చెప్పడం మహిళలకు ద్రోహం చేయడం కాదా?.. అని ప్రశ్నించారు. అలాగే 50 సంవత్సరాలు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రూ.4 వేలు పెన్షన్ ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని చెప్పి నిలువునా ముంచారని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ హామీల పేరుతో ఇంటింటికీ బాండ్లు పంచి ఇప్పుడు మాట తప్పడం చంద్రబాబు మోసాలకు పరాకాష్ట అన్నారు. తొలి ఏడాదికే రూ.32,400 కోట్లు అక్కచెల్లెమ్మలకు ఇవ్వకుండా మోసం చేశారని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు ఇస్తామని చెప్పిన చంద్రబాబునాయుడు ఇప్పుడు అన్ని వర్గాలను మోసం చేయడం దారుణమన్నారు. మోసపూరిత ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

హైరిస్క్ గర్భిణుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): హైరిస్క్ గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులు, సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సుఖప్రసవం అయ్యే విధంగా చూడాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ సూచించారు. స్థానిక ముజఫర్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో గత సంవత్సరం జూన్‌లో సంభవించిన మాతృమరణంపై డీఎంహెచ్‌ఓ తన ఛాంబర్‌లో బుధవారం సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలోని సిబ్బంది, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, వైద్యాధికారులు గర్భిణులను గుర్తించి, వారికి సరైన సమయంలో వైద్యసేవలు అందిస్తే తల్లుల మరణాల శాతం తగ్గించవచ్చని కమిటీ నిర్ధారించింది. గర్భిణులను హైరిస్క్‌గా గుర్తిస్తే ఆశా, ఆరోగ్య కార్యకర్త, పర్యవేక్షకులతో ట్రాక్ చేసి సమీప సామాజిక ఆరోగ్య కేంద్రం, ఏరియా ఆసుపత్రులు, ప్రభుత్వ సర్వజన వైద్యశాలలలో చికిత్స అందించడం ద్వారా మాతాశిశు మరణాలు తగ్గించవచ్చని పేర్కొంది. హైరిస్క్ గర్భిణులను కాన్పు తేదీకి మూడు రోజులు ముందుగానే ట్యాగ్ చేయబడిన ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యేలా చూడాలని సూచించారు. డిస్ట్రిక్ట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ నాగప్రసాద్‌బాబు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జఫ్రుల్లా, డీపీఎంఓ డాక్టర్ ఉమ, గైనకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ సావిత్రి, డాక్టర్లు షబానాబేగం, రామశివనాయక్, దివ్యశ్రీ, రంగస్వామి, అన్నపూర్ణ, సుప్రియ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

టీబీపై అవగాహన



చిల్లబండలో టీబీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

కోడుమూరు రూరల్ : టీబీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా అనుమానిత లక్షణాలుంటే వెంటనే పరీక్షలు చేయించుకుని తగిన చికిత్స పొందాలని జిల్లా టీబీ ఆఫీసర్ భాస్కర్ సూచించారు. బుధవారం మండలంలోని చిల్లబండ గ్రామంలో టీబీ వ్యాధిపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిల్లబండ గ్రామం టీబీ రహిత గ్రామంగా ఎంపికైనందున గ్రామ పంచాయతీకి టీబీ ముక్త్ పంచాయతీ అవార్డు ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం టీబీ వ్యాధి లక్షణాలు, ఏవిధంగా సంక్రమిస్తుంది, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ భాస్కర్, సీహెచ్‌ఓ శాంతమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్ యాదవ్, సూపర్‌వైజర్ శారద, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోలుకోలేక రైతు మృతి



కురువ ఎల్ల నాగన్న (ఫైల్)

వెల్దుర్తి: వ్యవసాయం, అప్పులు బరువై మూడు రోజుల క్రితం పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన రైతు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు..మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన కురువ ఎల్ల నాగన్న (55) తన కున్న నాలుగు ఎకరాలతో పాటు మరో నాలుగు ఎకరాల కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసేవాడు. గతేడాది 8 ఎకరాల్లో పత్తి, మొక్కజొన్న పంటల సాగు చేశాడు. ప్రస్తుతం 3 ఎకరాల్లో మొక్కజొన్న వేసి మిగిలిన 5 ఎకరాల్లో పెట్టుబడికి సొమ్ము లేక, ప్రభుత్వ సాయమూ కరువై పంటలు వేయలేదు. గతేడాది పంటలు సరిగా లేక, వచ్చిప పంటలకు గిట్టుబాటు దొరకక, సాగు పెట్టుబడికి, కుటుంబ ఖర్చులకు చేసిన అప్పులు మొత్తంగా రూ.6లక్షలకు చేరాయి. తీర్చే దారి లేక ఈనెల 19న తన పొలంలో పురుగు మందు తాగాడు. గమనించిన పెద్ద కుమారుడు కురువ శేఖర్ అపస్మారక స్థితికి చేరుకుంటున్న తండ్రిని హుటాహుటిన వెల్దుర్తి సీహెచ్‌సీకు, అక్కడి నుంచి కర్నూలు ఆసుపత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య కురువ పుల్లమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా
- చిన్నటేకూరు గురుకుల కళాశాల, అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కల్లూరు: వసతిగృహాల్లో ఉన్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కల్లూరు మండలం చిన్నటేకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలను జిల్లా కలెక్టర్ తనఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలు, విద్యా బోధన గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు నిద్రపోవడానికి అదనంగా రెండు గదులు, కొన్ని గదుల్లో పైకప్పు పాడైనందువల్ల వాటి మరమ్మతులక అంచనాలు సిద్ధం చేయాలని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవిని ఆదేశించారు.టాయిలెట్‌లను పరిశీలిస్తూ మరింత మెరుగ్గా టాయిలెట్లను నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్వోప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని డీసీఓ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా త్వరలో మరమ్మతులకు, గదుల నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

తరగతి గదిలో పాఠాలు విన్న కలెక్టర్

జిల్లా కలెక్టర్ గురుకుల కళాశాలలో విద్యార్థులతో కలసి గణిత లెక్చరర్ బోధిస్తున్న పాఠం విన్నారు. విద్యార్థులకు నాణ్యమై విద్యను అందించాలని, సకాలంలో సిలబస్‌ను పూర్తి చేయాలని అధ్యాపకులను సూచించారు. అలాగే మెనూ ప్రకారం రుచికరమైన నాణ్యమైన భోజనం అందించాలని, వసతి గృహంలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఐఐటీ నీట్ అకాడమీ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరప్ప, ఎస్‌డబ్ల్యూఆర్‌ఈఎఫ్ ఎక్స్ చైర్మన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, చిన్నారులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. చిన్నటేకూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలు, పిల్లలకు అందుతున్న సేవలను పరిశీలించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో పౌష్టికాహార లోపం లేకుండా చూడాలని, పౌష్టికాహార కిట్లను పంపిణీచేసి, వాటిని సకాలంలో వినియోగించుకునేలా చూడాలన్నారు. అనంతరం వంట గదిలో పిల్లలకు వండిన ఆహారాన్ని కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ నిర్మల, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత బస్సు ఏర్పాటు చేయాలి

వెల్దుర్తి: కృష్ణగిరిలోనున్న మోడల్ స్కూల్‌కు వెల్దుర్తి మండల కేంద్రం నుంచి వెళ్లే విద్యార్థులకు వెంటనే ఉచిత ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.సోమన్న, సీపీఐ మండల కార్యదర్శి టి.కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం వారు స్థానిక ప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి స్థానిక సీహెచ్‌సీ ఎదుటనున్న రహదారిపై ధర్నా చేపట్టారు.నాయకులు అడవి రాముడు, హేమంత్, నందు, సాయితేజ, చిన్నమాదులు, శివ పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న బి.గిడ్డయ్య

కర్నూలు(సెంట్రల్): కర్నూలులో ఆగస్టు 9, 10, 11 తేదీల్లో నిర్వహించే సీపీఐ 24వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవా రం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా సంఘాలు, నగర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెండు రోజులపాటు జరిగే జన్ సేవాదళ్ క్యాంపును విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. భారత కమ్యూనిస్టు పార్టీ దేశ స్వాతంత్ర్యం కోసం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అనేక కుట్రలను ఎదుర్కొని పోరాటాలు చేసిందన్నారు. కర్నూలులో జిల్లాలోనూ సీపీఐ ఎన్నో పోరాటాలు చేసిందని చెప్పారు. జిల్లా మహాసభల్లో భాగంగా మొదటి రోజు వేలాది మందితో ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. మహాసభల విజయవంతానికి పార్టీ శ్రేయోభిలాషులు, పెద్దలు, దాతలు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆహ్వాన సంఘం అధ్యక్షుడు కె.జగన్నాథం, నాయకులు మునెప్ప, ఆవులశేఖర్, మహేష్, లలితమ్మ పాల్గొన్నారు.

నగర సమగ్రాభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): కర్నూలు నగర సమగ్రాభివృద్ధికి ప్రజల సహకారం కీలకమని, నగరాన్ని ఆదర్శంగా నిలిపేందుకు ప్రతి పౌరుడు సహకారం అందించాలని కమిషనర్ పి.విశ్వనాథ్ కోరారు. స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో బుధవారం కమిషనర్ మాట్లాడుతూ.. మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు నగర ప్రజలు సహకరించి తడి, పొడి చెత్తను వేర్వేరుగా కార్పొరేషన్ సిబ్బందికి అందించాలన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సమర్థవంతంగా అమలు చేస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహం ఉంటుందన్నారు. భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణకు సరికొత్త విధానం తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఆగస్టు 1 నుంచి నగర పరిధిలో సీ, డీ వేస్టేజ్ సేకరించి జొహరాపురం డంపింగ్ యార్డుకు తరలిస్తామన్నారు. రహదారులపై పశువులను వదిలితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మూడు రోజుల్లోగా పశువులను తరలించాలని లేని పక్షంలో నగరపాలక యంత్రాంగం పశువులను గోశాలకు తరలిస్తుందని హెచ్చరించారు. నగర ప్రజలకు 24 గంటల పాటు సేవలందించేందుకు టోల్ ఫ్రీ నంబర్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. అలాగే పన్ను వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఏటా రూ.100 కోట్ల ఆదాయం నగరపాలక సంస్థకు రావాల్సి ఉందన్నారు. పన్నుదారులు తప్పనిసరిగా ఆస్తి పన్ను, కుళాయి, ట్రేడ్ లైసెన్సులు, వినోద పన్ను బకాయిలను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు. మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేస్తున్నట్లు చెప్పారు. నగరంలో తొలి విడత 9 పార్కులు ఎంపిక చేశామని, వాటి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. నగరానికి అవసరమైన 2 ఎంఎల్‌డీల ఎస్టీపీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోండి

నగర పరిధిలో నివశిస్తూ సొంతిల్లు లేని పేదలు ఇళ్ల స్థలాల కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ సూచించారు. అర్హులైన వారికి 2 సెంట్ల స్థలంతో పాటు నిర్మాణానికి సబ్సిడీ ఇస్తామన్నారు. అలాగే నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని, ముఖ్య ప్రాంతాల్లో వీధి వ్యాపారుల కోసం వెండర్ జోన్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సచివాలయాల ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు.

కమిషనర్‌ను కలిసిన జర్నలిస్టులు



కమిషనర్ పి.విశ్వనాథ్‌కు బొకే అందిస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.విశ్వనాథ్‌ను ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం సాయంత్రం ఏపీడబ్ల్యూజేఎఫ్ నగర కమిటీ అధ్యక్షుడు ఎం.శివశంకర్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి టి.మద్దులేటి, రాష్ట్ర కమిటీ సభ్యుడు గోరంట్లప్ప కమిషనర్‌ను ఆయన కార్యాలయంలో కలసి బొకేను అందజేసి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి విన్నవించారు. అందుకు ఆయన స్పందించి జర్నలిస్టుల సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే మొదటి ప్రాధాన్యతగా పరిష్కరించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.